# గేట్లు తీయరు.. లోనికి రానివ్వరు!



గేటుకు తాళం వేయడంతో ఆరుబయటే నిల్చున్న అధికారులు

- ఫాక్స్‌సాగర్ బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణదారుల బరితెగింపు
- దర్జాగా గేట్లకు తాళం వేసి లోపల షెడ్ల పనులు
- అధికారులను గేట్ల ముందే నిలబెట్టిన నిర్మాణదారులు



ఫాక్స్‌సాగర్ చెరువుకట్ట కింద వెలిసిన భారీ షెడ్లు..

**జీడిమెట్ల:** రాబోయే కొత్త తరాలకు చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్, గ్రీన్ జోన్‌ల ఫలాలను అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చిన అక్రమ భూకబ్జాదారులు నిర్మాణాలు ఏమాత్రం ఆగడం లేదు. చెరువుల పరిరక్షణే ధ్యేయంగా పాటుపడాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయ లోపంతో ఇప్పటికే వందల ఎకరాల చెరువులు అన్యాక్రాంతమయ్యాయి.

**బఫర్ జోన్‌లో అక్రమంగా వెలసిన భారీ షెడ్లు..**

సుభాష్‌నగర్ డివిజన్‌లోని ఫాక్స్‌సాగర్ చెరువు బఫర్ గ్రీన్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తూనే ఉన్నాయి. అగ్రికల్చర్ జోన్‌ను నాన్‌అగ్రికల్చర్ జోన్‌గా మారుస్తూ నాలా కన్వెన్షన్‌ను కేవలం కాగితాలకే పరిమితం చేస్తూ ఎకరాల జాగాల్లో అక్రమ షెడ్లు నిర్మిస్తున్నారు. ఇక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అక్రమ నిర్మాణాల పరిశీలను రాగా అధికారులని లోనికి రానివ్వకుండా బయట గేట్లకు తాళాలు పెట్టి కార్మికులతో గేటులోపల అక్రమ షెడ్ల పనులను పూర్తిచేశారంటే అతిశయోక్తికాదు.

◆ ఫాక్స్‌సాగర్ చెరువుకట్ట కింద జరుగుతున్న అక్రమ నిర్మాణషెడ్ల పనులను ఆపేందుకు వచ్చిన అధికారులను బయట గేట్ల వద్దే అడ్డుకుని తాళాలు పెట్టి గంటసేపు ఎండలో నిలబెట్టారు అక్రమ నిర్మాణదారులు. అధికారులు అక్కడ చేసేది ఏమిలేక జరుగుతున్న అక్రమ నిర్మాణానికి నోటీసులను అందజేశారు. బఫర్ జోన్‌లను కాపాడతామని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అన్నారు. ఇప్పటికే ఫాక్స్‌సాగర్ చెరువు భూములు 300 ఎకరాలకుపైగా అన్యాక్రాంతమయ్యాయని స్థానిక డివిజన్ ప్రజలు సంబంధిత అధికారులపై మండిపడుతున్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినపుడే అధికారులు తూతూ మంత్రంగా పర్యవేక్షిస్తున్నారే తప్పా కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాలను కాపాడటంలో విఫలం అవుతున్నారన్నారు.

**బఫర్‌జోన్ నిర్మాణాలకు ఇంటి నంబర్లు.!**

అన్ని పత్రాలు పక్కాగా ఉండి.. ఓ సాధారణ వ్యక్తి ఇంటి నంబర్ కోసం జీహెచ్ఎంసీ కార్యాలయం చుట్టూ తిరిగినా కనికరించరు అధికారులు. అలాంటిది బఫర్‌జోన్‌లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు మాత్రం అండగా నిలుస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉండి, ఎన్‌వోసీ పత్రాలు లేకపోయినా అన్నీ వారే చూసుకొని ఇంటి నంబర్‌లను జారీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీని కోసం కింది స్థాయి సిబ్బంది నుంచి కీలక అధికారులు సైతం పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకొని ఇష్టానుసారంగా ఇంటి నంబర్‌లు కేటాయిస్తూ అక్రమదారులకు వత్తాసు పలుకుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీటిపై ఎవరైనా ఫిర్యాదులు చేసేందుకు కార్యాలయానికి వస్తే.. అన్నీ సక్రమంగా ఉన్నాయని.. నిబంధనలకు లోబడి మాత్రమే నిర్మాణాలు చేపడుతున్నట్లు కట్టు కథలు చెబుతున్నారన్నారు. అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని స్థానిక నివాసితులు కోరుతున్నారు.

**చెరువు భూముల ఆక్రమణలతో ప్రతి ఏటా ముంపు..**

ఫాక్స్‌సాగర్ చెరువు కట్టకింద ఇష్టానుసారంగా వెలుస్తున్న అక్రమనిర్మాణాలతోనే ముంపు సమస్య తలెత్తుతుందని పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడున్న భూములు గతంలో వ్యవసాయం కోసం మాత్రమే వినియోగించారు. మరి కొంత భూమి చెరువు బఫర్ జోన్ ఉంది. ఒక వేళ వ్యవసాయ భూమిలో నిర్మాణాలు చేపడితే.. నాన్ అగ్రికల్చర్ కింద కన్వర్ట్ చేయడంతో పాటు నాలా మార్పిడి కూడా చేయాల్సి ఉంటుంది. నాలా మార్పిడి చేయాలంటే సుమారు 40 శాతం భూమిని కేటాయించాల్సి ఉంటుందని.. అలా చేస్తే భూమి విస్తీర్ణం తగ్గుతుందని ఎలాంటి నిబంధనలను పట్టించుకోకుండా అధికారుల సాయంతో నిర్మాణాలు చేపడుతున్నా.. ఎవరూ పట్టించుకోకపోవడంతోనే ప్రతీ ఏటా ముంపులో తమ బతుకులు ఆగమవుతున్నాయని సుభాష్‌నగర్ డివిజన్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వాటిపై ఇప్పటికైన కఠిన చర్యలు తీసుకొని చెరువుల భూములను కాపాడి పరివాహక ప్రజలకు ముంపు సమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు.

## నేడు ప్యాకేజింగ్ సెక్టార్లలో అవకాశాలపై సదస్సు

**నిజాంపేట్:** ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో గురువారం పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ సెక్టార్లల్లో అవకాశాలపై ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో అవగాహన కల్పించనున్నారు. ఉదయం 10 గంటల సాయంత్రం వరకు కొనసాగే ఈ కార్యక్రమానికి ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ సుమతి, సీఎస్ఐఆర్ ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్ ప్రభాకర్‌రావు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ డిప్యూటీ డైరెక్టర్ నటరాజ్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

## రూ.5312 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నేతలు

**రంగారెడ్డినగర్:** ప్రభుత్వాలు మారినా విద్యార్థుల జీవితాల్లో మార్పు రావడం లేదని మేడ్చల్ జిల్లా ఏబీవీపీ కన్వీనర్ నగేష్ అన్నారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం ఐడీపీఎల్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ... ప్రభుత్వాలు యూనివర్సిటీ స్థలాలు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటి వరకు విద్యార్థులకు బకాయిలు ఉన్న రూ.5312 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య సమితి సభ్యురాలు మనీషా, కార్యవర్గ సభ్యులు ప్రియాంక, దినేష్, వివేక్, గౌతమ్, భార్గవి, నాగేంద్ర పాల్గొన్నారు.

## 11న రావి నారాయణరెడ్డినగర్ ఎన్నికలు

**సుభాష్‌నగర్:** గాజులరామారం డివిజన్ రావి నారాయణరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్థానిక పోచమ్మ గుడి వద్ద ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎలక్షన్ కమిటీ పేర్కొంది. బస్తీలో ఉన్న 600 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రెసిడెంట్ బరిలో ఎస్. గోపాల్, బి నరసింహులు ఉన్నారు. అదే రోజు సాయంత్రం ఎన్నికల ఫలితాలను విడుదల చేయనున్నారు. అనంతరం ప్రెసిడెంట్ సమక్షంలో మిగతా కార్యవర్గాన్ని ప్రకటిస్తారు.

## ఆటో కార్మికుల సమస్యలను శాసనమండలిలో లేవనెత్తుతా

- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు
- వినతి పత్రం అందజేసిన ఆటో కార్మికులు

**కుత్బుల్లాపూర్:** ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ ప్రాంతానికి చెందిన ఆటో కార్మికులు బుధవారం రాజును కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం నేపథ్యంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గతంలో రోజుకు రూ.వెయ్యి సంపాదించేవారమని, ఇప్పుడు రూ.200 కూడా రావడం లేదన్నారు. వాయిదాలు చెల్లించకపోడంతో ఫైనాన్స్ వ్యాపారాలు ఆటోలను జప్తు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన శంభీపూర్ రాజు ఆటో కార్మికుల సమస్యలను శాసనమండలి సమావేశాల్లో ప్రస్తావించి వారికి న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా కుత్బుల్లాపూర్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని శంభీపూర్ రాజుకు వినతి పత్రాలు సమర్పించారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ఆటో కార్మికులు

## అంగన్‌వాడీ సెంటర్‌కు ఫ్యాన్లు అందజేత



దూలపల్లి అంగన్‌వాడీ సెంటర్‌కు ఫ్యాన్లు అందజేస్తున్న చింతల నాగరాజుయాదవ్

**సుభాష్‌నగర్:** అంగన్‌వాడీలో చదువుకునే చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా దశలవారీగా తన వంతు సహాయం అందిస్తానని పాడి రైతు చింతల నాగరాజు యాదవ్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని రామాలయం వద్ద ఉన్న అంగన్‌వాడి సెంటర్‌లో చింతల నాగరాజ్ యాదవ్ బుధవారం రెండు ఫ్యాన్లను, మ్యాట్లను అందజేశారు. 20 రోజుల వ్యవధిలో చిన్నారులకు స్పోర్ట్స్ డ్రెస్, స్పోర్ట్స్ సామగ్రిని పంపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ బుర్గుబావి అనితను సన్మానించారు.

## డ్రగ్ ఫ్రీ హైదరాబాద్‌కు సహకరించాలి

**మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్**

**గచ్చిబౌలి:** స్టార్ హోటళ్లలో డ్రగ్స్‌కు అనుమతి ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ స్పష్టం చేశారు. మాదాపూర్ జోన్ పరిధిలోని స్టార్ హోటళ్ల నిర్వాహకులు, యజమానులతో ఆయన బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డ్రగ్ ఫ్రీ తెలంగాణ, డ్రగ్ ఫ్రీ హైదరాబాద్‌కు ప్రతి ఒక్కరూ విధిగా సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి డ్రగ్స్‌కు అనుమతిస్తే ఎండీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టార్ హోటళ్లలో మైనర్లకు మద్యం విక్రయించరాదని, ఇవ్వరాదని సూచించారు. ప్రైవేటు పార్టీలకు అనుమతించే సమయంలో డ్రగ్స్ లేకుండా పార్టీలు జరిగే చూడాలని, అయినప్పటికీ డ్రగ్స్ వినియోగించినట్లు సమాచారం వస్తే వినియోగించిన, సరఫరా చేసిన హోటల్‌పై కూడా చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని హెచ్చరించారు. సమావేశంలో మాదాపూర్ ఏడీసీపీ నర్సింహ్మారెడ్డి, ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

**రాయదుర్గం:** పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సైబరాబాద్ డీసీపీ (క్రైమ్స్) కొత్తపల్లి నర్సింహ సూచించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లోని సీటీసీ కార్యాలయంలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలను విధిగా చేయించుకోవాలని సూచించారు. 1022 హోంగార్డులు, సిబ్బందికి పలు వైద్య పరీక్షలను నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి కార్డియాలజీ, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్ డాక్టర్లు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ డాక్టర్ దుర్గేష్ శివ, సీటీసీ డాక్టర్లు సరిత, సుకుమార్, అదపు డీసీపీ రవిచందన్‌రెడ్డి, ఏసీపీ హోంగార్డ్స్ కృష్ణ, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మీటర్ రీడింగ్ కార్మికులను ఆర్టిజెన్లుగా పరిగణించాలి



జీడిమెట్ల డివిజన్ మీటర్ రీడింగ్ కార్మికులు

**కుత్బుల్లాపూర్:** తమపై అధిక భారం మోపి మానసిక క్షోభకు గురిచేయొద్దని జీడిమెట్ల డివిజన్ మీటర్ రీడింగ్ కార్మికులు కోరుతున్నారు. మంగళవారం జీడిమెట్ల మీటర్ రీడింగ్ సిబ్బంది కరెంట్ డిపార్ట్‌మెంట్ ఎస్ఈకి లేఖను రాశారు. చాలీచాలని జీతాలతో బతుకు వెల్లదీస్తున్న తమకు గృహజ్యోతి పథకం కింద మీటర్‌కు ఫోన్ నెంబర్‌ను జతచేయడం భారంగా మారిందని వారు లేఖలో పేర్కొన్నారు. తక్కువ సమయంలో ఈపని చేయడం తమకు భారమైన పని అని వారు తెలిపారు. అదేవిధంగా మీటర్ రీడింగ్ కార్మికులను ఆర్టిజెన్‌లుగా పరిగణించాలని కోరారు. సంస్థ కోసం ఎంతో పని చేస్తున్న తమకు జీతాలు సైతం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఇర్ఫాన్ పఠాన్, ఎంఎస్‌కే ప్రసాద్ సందడి



బాచుపల్లిలోని వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాలలో బుధవారం స్టార్‌స్పోర్ట్స్ తెలుగు ఆధ్వర్యంలో 'ఐపీఎల్ ఆన్ స్టార్'పేరిట ఐపీఎల్ ప్రోమో కార్యక్రమం జరిగింది. ప్రముఖ క్రికెటర్లు ఎంఎస్‌కే ప్రసాద్, ఇర్ఫాన్ పఠాన్‌లు క్రికెట్ ఆడి సందడి చేశారు. విశేష ప్రజాదరణ పొందిన ఐపీఎల్ దేశీయ క్రికెట్‌కు అందిస్తున్న సహకారాన్ని ఈ సందర్భంగా క్రికెటర్లు ప్రస్తావించారు. ఐపీఎల్‌తో యువ క్రికెటర్లకు తమ ప్రతిభను చూపేందుకు అవకాశం కలుగుతోందన్నారు. – నిజాంపేట్

## నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



కొంపల్లిలో వీధిదీపాల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

**కుత్బుల్లాపూర్:** మౌలిక వసతుల కల్పనతో నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ పరిధిలో రూ.81 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్‌తో కలిసి శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేశారు. కొంపల్లి మున్సిపాలిటీలోని కమాన్ నుంచి శివాలయం వరకు రూ.15లక్షలతో వీధిదీపాల పనులకు శంకుస్థాపనలు చేశారు. అదే విధంగా రూ. 76 లక్షలతో పూర్తి చేసిన బీటీ రోడ్డు, అంగన్‌వాడీ కేంద్రంలో రూ.5లక్షలతో నిర్మించిన కిచెన్ షెడ్డులను అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, సీనియర్ నాయకులు బూరుగుబావి హనుమంత రావు, కౌన్సిలర్లు పూజారి వసంత, డప్పు కిరణ్, పాక్స్ డైరెక్టర్లు సీహెచ్ మధు, మల్లేష్, మహిళా అధ్యక్షురాలు సంగీతారెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ

**నిజాంపేట్:** రోడ్డు భద్రత విషయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, చాలా వరకు ప్రమాదాలు రాంగ్ రూట్, మొబైల్ డ్రైవింగ్ వల్లనే చోటు చేసుకుంటున్నాయని ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం బాచుపల్లిలోని రెడ్డీ లేబొరేటరీస్ పరిశ్రమలో కార్మికులు,ఉద్యోగులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని, అదే విధంగా రోడ్డుపై రాకపోకలు సాగించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించినట్లయితే చాలా వరకు రోడ్డు ప్రమాదాలు నివారించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటయ్య, టీటీఐ ఇన్‌చార్జ్ గురువయ్య, మియాపూర్ ట్రాఫిక్ సీఐ కిరణ్‌కుమార్, ఆర్ఐ అనీల్‌కుమార్, సిబ్బంది మల్లేశ్వర్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బాచుపల్లిలో ఓ ఇంట్లో ఇన్‌స్పెక్షన్ నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

**నిజాంపేట్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహలక్ష్మి పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని విద్యుత్ శాఖ మేడ్చల్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ సాయిబాబా అన్నారు. బుధవారం విద్యుత్ శాఖ అధికారులు నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలో పలు గృహాలను సందర్శించి విద్యుత్ మీటర్లను సదరు గృహ యజమానుల ఫోన్లకు అనుసంధానం చేయడంతో పాటు గృహలక్ష్మి పథకాన్ని నమోదు చేసుకున్న వారి వివరాలను పరిశీలించారు. కూకట్‌పల్లి జోన్ డీఈ చక్రవర్తి, బాచుపల్లి సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

## అర్జున్‌కు 'తెలుగు వెలుగు మహానంది' అవార్డు



అవార్డు అందుకుంటున్న ఇంద్రజాలకుడు అర్జున్

**దుండిగల్:** దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట ప్రాంతానికి చెందిన ఇంద్రజాలకుడు ఎం.అర్జున్‌కు అరుదైన గౌరవం దక్కింది. స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని హన్మకొండలో జాతీయ పురస్కారాల మహోత్సవాన్ని నిర్వహించారు. ఇంద్రజాల రంగంలో దశాబ్ద కాలంగా విశిష్ట కృషి చేస్తున్న అర్జున్‌ను 'తెలుగు వెలుగు మహానంది'అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ అర్కల అనంతస్వామి ముదిరాజ్ బుధవారం అర్జున్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అర్జున్‌కు తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రభుత్వం స్పందించి తగిన ప్రోత్సాహకాలు అందించాలని కోరారు.

## అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా విజయభాస్కర్

**రాయదుర్గం:** ఐఐఎం-వైజాగ్‌లో డాక్టర్ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన విజయభాస్కర్ మారిశెట్టి నియమితులయ్యారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్న విజయభాస్కర్ విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) లో డాక్టర్ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. అంబేద్కర్ చైర్‌లో ముఖ్యంగా దేశంలో సామాజికంగా వెనుకబడిన సమాజాలను ఉద్ధరించే లక్ష్యంతో పరిశోధన, శిక్షణా కార్యక్రమాలు, ఫీల్డ్ వర్క్, బోధనా కార్యకలాపాలను నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తుంది.

## గంజాయి విక్రయదారుడి అరెస్టు

**1.2కిలోల గంజాయి స్వాధీనం**





గంజాయితో పట్టుబడ్డ సాయికిరణ్

**నిజాంపేట్:** ఓ గంజాయి విక్రయదారుడి నుండి 1.2 కిలోల గంజాయిని బాలానగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం బార్గర్ జిల్లా కులుందా గ్రామానికి చెందిన ముత్యాల సాయికిరణ్(24) వైజాగ్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్స్ పూర్తి చేసి ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చాడు. మాదాపూర్‌లోని తన స్నేహితుల హోటల్‌గదిలో పేయింగ్ గెస్టుగా ఉంటున్న అతను నగరంలో గంజాయికి డిమాండ్ ఉందని తెలుసుకుని ఒడిస్సా నుంచి సనోజ్ అనే వ్యక్తి నుండి గంజాయిని కొనుగోలు చేశారు. దానిని బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు కళాశాల ప్రాంతం, ఇతర ప్రాంతాల్లో విక్రయాలు చేపడుతూ వస్తున్నాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు బుధవారం గోకరాజు రంగరాజు కళాశాల వద్ద తచ్చాడుతున్న సాయికిరణ్‌ను అదుపులోకి తీసుకోగా అతని వద్ద 1.2 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణకు బాచుపల్లి పోలీసులకు అప్పగించారు. మరో నిందితుడు సనోజ్ పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరికలు



కొలన్ శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నిజాంపేట్ రాజీవ్‌గృహకల్ప వాసులు

**నిజాంపేట్:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పకు చెందిన సుధాకర్, నవాబ్, దామోదర్, రవి, శ్రీను, పద్మ, రమేష్ ,లక్ష్మణ్, వరలక్ష్మి, గణేష్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి శ్రీనివాస్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు.

## ఆలయ కమిటీ పేరు దెబ్బతీస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**సుభాష్‌నగర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రసిద్ధిగాంచిన సూరారం కట్టమైసమ్మ ఆలయ కమిటీలో చైర్మన్ విషయమై కొన్ని రోజులుగా రచ్చ మొదలైంది. వివాదం చినికిచినికి గాలివానై పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుంది. స్థానికంగా మన్నే ముత్యాలు అనే వ్యక్తి ఆలయ కమిటీ చైర్మన్‌గా బ్యానర్ వేసుకోవడంతో దీన్ని తప్పు పడుతూ గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు సూరారం పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. మన్నే ముత్యాలు గ్రామస్తుల నిర్ణయం లేకుండా తనకు తానుగా చైర్మన్‌గా ప్రకటించుకుని బ్యానర్ వేసుకున్నారని.. దీంతో పాటు కొంతమంది కొన్ని రోజులుగా ఆలయ కమిటీ పేరుతో చందాల రూపకంగా వసూళ్లకు పాల్పడుతున్నారని సీఐ వెంకటేశ్వరరావుకు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయ కమిటీ పేరు ప్రఖ్యాతలను దెబ్బతీస్తున్నా ఇలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గత రెండు రోజుల్లో జాతర ప్రారంభం కానున్న తరుణంలో ఒకరిద్దరూ తమ స్వార్థంతో ఇలాంటి వివాదాలు చోటు చేసుకోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కొంతమంది గుడి పేరుతో అందిన కాడికి దోచుకుంటారని గ్రామస్తులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

07క్యూబీఆర్26పి: ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేస్తున్న సూరారం గ్రామస్తులు

## ఫ్రెషర్స్ డే.. అంతా సందడే



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

**రంగారెడ్డినగర్:** చింతల్‌లోని భాగ్యరథి డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం గాంధీనగర్ లోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన క్యాట్ వాక్, ఫ్యాషన్ షో, తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా గత సెమిస్టర్‌లో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థి సోఫియా సమ్రీన్‌ను సన్మానించడంతో పాటు ఉచితంగా విద్యను అందిస్తామని యాజమాన్యం పేర్కొంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ గోవిందరెడ్డి, ఎన్.వెంకట్‌రెడ్డి, జి.రమేష్ బాబు, కె.రామకృష్ణ, నల్ల జైశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.